గోదారంగనాథుల కల్యాణోత్సవం


గోదారంగనాథుల కల్యాణోత్సవంలో భక్తులు


కల్యాణమండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చిన భక్తులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని శ్రీ వెంకన్నగుట్ట వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. సోమవారం ధనుర్మాసం చివరిరోజు కావడంతో ఉదయం సేవాకాలం గోదా అమ్మవారి ఆరాధన, ప్రత్యేక పాసురం చదివి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీమన్నారాయణ ఆచార్యులు వినిపించారు. అనంతరం గోదారంగనాథులని ఊరేగింపుగా దేవాలయంలోని ప్రత్యేకంగా అలంకరించిన మండపానికి భక్తులు తీసుకువచ్చారు. ఉదయం 10.30 గంటలకు గోదారంగనాథుల కల్యాణ మహోత్సవం అత్యంత రమనీయంగా, కమనీయంగా భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు.

సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి


ముగ్గులను పరిశీలించిన మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: సంక్రాంతి పండగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. 11వ వార్డు నెమలినగర్‌లో కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఆయన బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు నెలవుగా పండగలు వస్తాయని, వాటిని భావితరాలకు అందించటంతోపాటు కలసికట్టుగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండగకు ముగ్గులు వేయటం, దసరాకు బతుకమ్మలను చేయటం మన ఆనవాయితీ అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బి.మీనముత్యాలు, జ్యోతి మల్లేష్, శ్వేతకిరణ్‌కుమార్, లావణ్యనరేష్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక


ఖానాపూర్ ఎమ్మార్పీఎస్ కమిటీని ఎన్నుకున్న నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల ఇన్‌చార్జి పి.గణేష్ మాదిగ, మాజీ సర్పంచ్ ఆర్. నర్సింహ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా పి.శంకర్‌మాదిగ, ఉపాధ్యక్షుడిగా డి.రవీందర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పోచయ్య మాదిగ, కార్యదర్శిగా జి.రాజు మాదిగ, కోశాధికారిగా ఎల్. ఆనంద్‌మాదిగ, అధికార ప్రతినిధిగా వై.ప్రకాశ్‌మాదిగలను ఎన్నుకున్నారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా సి.యాదయ్య మాదిగ, ఆర్. నర్సింగ్‌రావుమాదిగ, డి.కృష్ణ మాదిగ, హెచ్. సుమన్ మాదిగలను ఎన్నుకున్నట్టు గణేష్‌మాదిగ తెలిపారు.

‘లక్షగొంతులు, వెయ్యిడప్పుల’ పేరిట పతంగుల ఆవిష్కరణ



రాయదుర్గం: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్రంతోపాటు చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ‘లక్ష గొంతులు, వెయ్యి డప్పుల’ కార్యక్రమం పేరిట ప్రత్యేక పతంగులను తయారు చేయించారు. వాటిని రాయదుర్గంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు శ్యాంలెట్ గణేశ్ మాదిగ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రచారం చేసేందుకే ఈ పతంగులను రూపొందించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఊరపోచమ్మ ఆలయం వద్ద ఈ పతంగులను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ, నాయకులు త్రినాథ్, మహేశ్, బాలు స్థానికులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం


గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పూజారులు

రాజేంద్రనగర్: హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆవరణలో సోమవారం గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా దేవాలయ ఆవరణాన్ని చూడముచ్చటగా అలంకరించారు. గోదాదేవి కల్యాణ మహోత్సవానికి స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు హాజరై కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. గత నెల రోజులుగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు కల్యాణ మహోత్సవంతో ముగిశాయి. కల్యాణ మహోత్సవం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచకులు టి.కె.అభిరామ్‌ను దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.


గోదాదేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


చిన్నారికి భోగి పండ్లు వేసి ఆశీర్వదిస్తున్న మహిళలు

భోగి సందడి


భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేస్తున్న కాలనీవాసులు


మణికొండ శ్రీనివాసనగర్ కాలనీలో భోగిమంటలు


మైలార్‌దేవ్‌పల్లిలో భోగి వేడుకల్లో మాజీ కౌన్సిలర్ వెంకటేష్



భోగి పండుగ సందర్భంగా ఇంటి ముందు ముగ్గులు వేసిన మహిళ


బండ్లగూడలో పిల్లలకు భోగి పండ్లు వేస్తున్న కుటుంబ సభ్యులు


బండ్లగూడలో పతంగులు ఎగరవేస్తున్న తల్లీకూతురు

బండ్లగూడ/మైలార్‌దేవ్‌పల్లి/మణికొండ/రాజేంద్రనగర్: అంతటా సంక్రాతి పండుగా జోష్ మొదలైంది. పల్లె సంస్కృతికి అద్దంపడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకునే సంక్రాంతి వేడుకల్లో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, దుర్గా ఖలీజ్‌ఖాన్, బండ్లగూడ, సన్‌సిటీ, బైరాగిగూడ తదితర ప్రాంతాలు, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాలనీలు, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ప్రజలు సోమవారం బోగి పండుగను ఘనంగా నిర్వహించారు.ఇంట్లోని పాత సామగ్రిని ఇళ్ల ముందు భోగి మంటల్లో వేశారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మహిళలు తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పేర్చారు. సకినాలు, నువ్వుల లడ్డూలు, గారెలు, పూరీలు తదితర పిండి వంటలను తయారు చేశారు. కొన్ని దుకాణాల్లో కూడా వీటిని విక్రయించారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ పతంగులను ఎగురవేస్తూ సందడి చేశారు. కొంతమంది తమ బిల్డింగ్‌లపై బాక్సులు, డీజేలు, మైక్‌లను ఏర్పాటు చేసుకొని సంబరాలు జరుపుకున్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



పుప్పాలగూడ గోల్డెన్ ఓరియోల్ గేటెడ్ కమ్యూనిటీలో భోగిమంటలు


ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలతో మహిళా నేతలు, స్థానికులు


కోకాపేట లాంజ్ గేటెడ్‌కమ్యూనిటీలో భోగిమంటలు వేసిన నివాసితులు




భోగి మంటల వెలుగు జిలుగుల మధ్య అత్తాపూర్ లక్ష్మీరాం హరన్ అపార్ట్‌మెంట్ పరిసర ప్రారంభమైన సంక్రాంతి ఉత్సవాలు

బీజేపీ అధ్యక్షుల నియామకం


బీజేపీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి


బీజేపీ నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు నగేష్‌యాదవ్

మణికొండ: నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలకు భారతీయ జనతాపార్టీ నూతన అధ్యక్షులను నియమించింది. నార్సింగి మున్సిపాలిటీకి ఇప్పటి వరకు కోకాపేటకు చెందిన సీహెచ్ బిక్షపతియాదవ్ అధ్యక్షుడిగా ఉండగా ఆయన స్థానంలో అదే గ్రామానికి చెందిన జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. నగేష్‌యాదవ్‌ను నియమించారు. నార్సింగి మున్సిపాలిటీ నుంచి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మాజీ ప్రధాన కార్యదర్శి గోవిందగారి శివరాజ్‌ను నియమించారు. మణికొండ మున్సిపాలిటీకి ఇప్పటి వరకు అధ్యక్షుడిగా పనిచేసిన సి.బీరప్పను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డిని మున్సిపల్ అధ్యక్షుడిగా నియమించారు. వీరు రెండు సంవత్సరాల వరకు పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతారని జిల్లా అధ్యక్షుడు బి.నర్సింహారెడ్డి నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా సులిగే వెంకటేష్



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌ను గ్రేటర్‌లోనే అత్యంత బలమైన కంచుకోటగా బీజేపీని పటిష్టపరుస్తానని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ అన్నారు. హైదర్‌గూడకు చెందిన ఆయనను పార్టీ అధిష్టానం సోమవారం డివిజన్ నూతన అధ్యక్షులుగా నియమించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను అంకితభావంతో నెరవేరుస్తానని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మంచిరేవులలో గోదాకల్యాణం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్టు అర్చకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కల్యాణమహోత్సవం, అన్నప్రసాద వితరణలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సన్మానం


ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రావుకోళ్ల నాగరాజు

బండ్లగూడ: బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుకోళ్ల నాగరాజు సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆయన సూచించినట్లు నాగరాజు తెలిపారు.

నేరస్తులు జీవన విధానాన్ని మార్చుకోవాలి

గోల్కొండ: వివిధ క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారు, జైలు శిక్ష పడ్డ వారు తమ జీవన విధానాన్ని మార్చుకోవాలని గోల్కొండ డీఎస్పై రఫీయుద్దీన్ అన్నారు. సోమవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలు చేయడం ఆ తర్వాత వారికి శిక్షలు పడడం జరుగుతూనే ఉంటుందని, అయితే నేరస్తుల కుటుంబసభ్యులపై దీన్ని ప్రభావం ఎంతో ఉంటుందన్నారు.

వాహనం కింద నిద్రిస్తుండగా...

మైలార్‌దేవ్‌పల్లి: వాహనం కింద నేలపై నిద్రిస్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి(45) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాటేదాన్‌లోని కాటన్ బాక్స్ కంపెనీ పక్కన ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు సోమవారం పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా అతని తల పగిలి చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. గుర్తు తెలియని వాహనం కింద నేలపై నిద్రిస్తుండగా డ్రైవర్ గమనించకుండానే అతనిపై నుంచి వాహనాన్ని తీసుకువెళ్లడం వల్ల తల పగిలి అక్కడికక్కడే మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతడు స్థానికంగా భిక్షాటన చేసేవాడని స్థానికులు చెబుతున్నారు. నల్లరంగు ప్యాంటు, ఎరుపుగీతల చొక్కా, నీలం రంగు బనియన్, నల్ల లోదుస్తులు ధరించి ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మురారి గిరిధారిలో చిత్రకళ ప్రదర్శన


సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరులోని మురారి గిరిధారి గృహసముదాయంలో సంక్రాంతి సందర్భంగా చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రముఖంగా పిల్లలు వేసిన చిత్రాలు సంక్రాంతి శోభను తెలియజేసేలా ఉన్నాయి. నర్సింహారావు, నరసింహన్, శంకరయ్య, శ్రీహరి పాల్గొని ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.


ప్రదర్శనలో చిన్నారుల చిత్రకళలు

యువతిని ఢీ కొట్టిన కారు

మణికొండ హుడా కాలనీలో ఘటన


స్కూటీపై వెళ్తున్న యువతిని ఢీ కొట్టిన కారు

మణికొండ: రోడ్డు ఎత్తుగా ఉండటంతో అదుపుతప్పిన కారు స్కూటీపై వెళ్తున్న ఓ యువతిని ఢీ కొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీలో ఆదివారంరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హుడా కాలనీలోని లైట్ అండ్ లైట్ వద్ద భాగ్యలక్ష్మి కాలనీ వైపు నుంచి వచ్చిన మారుతి బ్రీజా కారు వచ్చింది. ఓపెన్ జిమ్ వద్ద ఓ మహిళ కారును నడుపుతూ, స్కూటీపై వస్తున్న ఎంప్లాయిస్ కాలనీకి చెందిన గాయత్రిని ఢీకొట్టింది. కారు, ఓపెన్ జిమ్ గోడ మధ్యల గాయత్రి చిక్కుకోవటంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గాయాలపాలైన యువతిని వెంటనే మణికొండలోని ఆవాస ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.